# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-07-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **మొహర్రం, తొలి ఏకాదశి పండుగల సందర్భంగా గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.**
2. **రాష్ట్రంలో ఎక్సైజ్ విధానంపై విస్తృత స్థాయిలో అధ్యయనం చేస్తున్నామని ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.**
3. **రాష్ట్ర శాసనసభ సమావేశాలు ఈ నెల 22వ తేదీన ప్రారంభమై ఐదు రోజుల పాటు జరుగుతాయి.**
4. **రోడ్డు రవాణా సంస్థ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి వెల్లడించారు.**
5. **శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నెల్లూరు నగరంలో ఈ రోజు ప్రారంభమైన రొట్టెల పండుగకు వివిధ ప్రాంతాల నుంచి బారాషహీద్ దర్గా వద్దకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు.**

==========================

మొహర్రం, తొలి ఏకాదశి పండుగల సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. హిందువులకు ఎంతో ప్రత్యేకమైన తొలి ఏకాదశి పండుగ రోజు నియమనిష్ఠలతో ఉపవాస దీక్షలు చేస్తున్న భక్తులందరికీ ఆ భగవంతుడు ఆనంద, ఆరోగ్య, ఐశ్వర్యాలను ప్రసాదించాలని కోరుకుంటున్నానని చంద్రబాబు నాయుడు ఎక్స్ వేదికగా తెలిపారు. మొహర్రం పర్వదినాన ముస్లిం సోదరసోదరీమణులకు శుభం కలిగేలా చూడాలని అల్లాను ప్రార్థిస్తున్నాని ఆయన పేర్కొన్నారు. అమరవీరుడు ఇమామ్ హుస్సేన్ సమాజం కోసం ప్రాణ త్యాగం చేశారు తప్ప అన్యాయమైన అధికారానికి తలొగ్గ లేదని చెప్పారు. ఇదే ఆదర్శంగా పరుల క్షేమాన్ని కాంక్షిస్తూ జీవితాన్ని గడపడమే మన కర్తవ్యం కావాలని అప్పుడే సమాజం వికసిస్తుందని హితవు పలికారు. మొహర్రం సందర్భంగా గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. త్యాగ నిరతికి, సహనానికి మొహర్రం ప్రతీక అని పేర్కొన్నారు. త్యాగం, శాంతి వంటి ఆదర్శాలు ఎప్పటికీ స్ఫూర్తినిస్తాయని గవర్నర్ తెలిపారు. త్యాగాలకు ప్రతీక మొహర్రమని మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. మత సామరస్యానికి, సమైక్యతకు ప్రతిరూపంగా నిలిచే ఈ మొహర్రంను ముస్లిములందరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన ఎక్స్ వేదికగా ఆకాంక్షించారు.

--------------------------

రాష్ట్రంలో ఎక్సైజ్ విధానంపై విస్తృత స్థాయిలో అధ్యయనం చేస్తున్నామని ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని కుటుంబ సమేతంగా ఆయన ఈ రోజు దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయం వెలుపల మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో అనేక శాఖల పనితీరుపై శ్వేత పత్రాలు విడుదల చేస్తున్నామని తెలిపారు. మరో మూడు శాఖలపై శ్వేతపత్రాలు త్వరలోనే విడుదల చేస్తామని వెల్లడించారు.

---------------------------

రాష్ట్ర శాసనసభ సమావేశాలు ఈ నెల 22వ తేదీన ప్రారంభమై ఐదు రోజుల పాటు జరుగుతాయి. ఈ సందర్భంగా మరో మూడు నెలలకు ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలిరోజు ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు. 23వ తేదీన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు బిల్లును సభలో ప్రవేశపెట్టనున్నారు. శ్వేతపత్రాలపైనా శాసనసభలో చర్చించనున్నారు. కాగా.. అక్టోబరులో పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టే యోచనలో ప్రభుత్వం ఉంది.

---------------------------

రోడ్డు రవాణా సంస్థ.. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆగస్టు 15వ తేదీన రాష్ట్రంలోఅన్నక్యాంటీన్లను ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు. గుంటూరు జిల్లా వెలగపూడి సచివాలయంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఉచిత బస్సు ప్రయాణంపై ప్రభుత్వం ఏర్పాటుచేసిన అధ్యయన కమిటీ కొన్ని సిఫార్సులు చేసిందని.. వాటి ఆధారంగా త్వరలోనే ఉచిత ప్రయాణాన్ని అందుబాటులోకి తెస్తామని స్పష్టంచేశారు. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల కంటే మెరుగైన విధానంతో ఉచిత బస్సు ప్రయాణాన్ని అమల్లోకి తెస్తామని వివరించారు.

---------------------------

ప్రకృతి వ్యవసాయ విధానాలపై ఆసక్తి చూపిస్తున్న ఇండోనేసియా, శ్రీలంక, జాంబియా, రువాండా దేశాలకు మన వద్ద ఈ విధానంలో విజయం సాధించిన రైతుల్ని పంపి.. సాంకేతిక మద్దతు అందించేందుకు రైతు సాధికార సంస్థ సిద్ధంగా ఉందని వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. రైతు సాధికార సంస్థ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు, ప్రభుత్వ సలహాదారు టి.విజయ్‌కుమార్, వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ తదితరులు నిన్న సచివాలయంలో మంత్రిని కలిశారు. దేశంలోనే మొదటిసారిగా ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయానికి గుల్బెంకియన్ అవార్డు అందుకున్నామని వివరించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాల్ని 45 దేశాల ప్రతినిధులు పరిశీలించడం గర్వకారణమని పేర్కొన్నారు. 15 రాష్ట్రాలకు ఛాంపియన్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్‌ను పంపి.. అక్కడ ప్రకృతి వ్యవసాయానికి నాంది పలికామని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి వారిని అభినందించారు.

---------------------------

రాష్ట్రంలో ఇంటింటికీ తాగునీటిని అందించే జలజీవన్ మిషన్ పథకం అమలుపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ ఈ నెల 19వ తేదీన ఢిల్లీలో ఈ అంశంపై సమీక్ష నిర్వహించనున్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి కె.పవన్‌కల్యాణ్ సమావేశానికి హాజరవుతున్నారు. రాష్ట్రంలో గడిచిన ఐదేళ్లలో జల్ జీవన్ మిషన్ పనులు ఆశించిన స్థాయిలో అమలు కాలేదు. రాష్ట్ర వాటా నిధులు సరిగా

కేటాయించని కారణంగా పనుల నిర్వహణపైనా తీవ్ర ప్రభావం చూపింది. ప్రతిపాదితపనుల్లో ఇప్పటికీ సగమూ పూర్తికాలేదు. ఈ నేపథ్యంలో జల్ జీవన్ మిషన్ సక్రమంగా అమలయ్యేలా నిర్వహిస్తున్న ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.

---------------------------

రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించిన రెండు విడతల కౌన్సిలింగ్‌లో 46 శాతం సీట్లు భర్తీ అయ్యాయని సాంకేతిక విద్యాశాఖ సంచాలకురాలు నవ్య తెలిపారు. మొత్తం 262 కళాశాలల్లో 81 వేల 420 సీట్లు ఉండగా.. 37 వేల 36 సీట్లు భర్తీ అయ్యాయని వెల్లడించారు. తుది విడత కౌన్సెలింగ్ ఫలితాలను నిన్న విడుదల చేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో 17 వేల 943 సీట్లు ఉండగా.. 11 వేల 42 సీట్లు నిండాయని, ప్రైవేటు కళాశాలల్లో 63 వేల 477 సీట్లకు గాను 25 వేల 994 సీట్లు నిండాయని ఆమె పేర్కొన్నారు.

---------------------------

ఉభయ తెలుగు రాష్ట్రాలకు నీటి విడుదల కోసం కష్ణానదీ యాజమాన్య బోర్డు నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీశైలం, నాగార్జున సాగర్‌లో ఉన్న 9.914 టీఎంసీల నీటిని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కి కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. త్రిసభ్య కమిటీ నిర్ణయం మేరకు ఆంధ్రప్రదేశ్‌కు 4.500 టీఎంసీలు, తెలంగాణకు 5.414 టీఎంసీల నీటిని కేటాయించింది. శ్రీశైలం నుంచి పవర్‌హౌసెస్ ద్వారానే నీరు విడుదల చేయాలని బోర్డు పేర్కొంది. ఈరోజు నుంచి నీటి విడుదలకు కృష్ణానదీ యాజమాన్య బోర్డు అనుమతిచ్చింది. తాగునీటి అవసరాలకే నీటిని వినియోగించాలని కేఆర్ఎంబీ స్పష్టం చేసింది.

---------------------------

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటన రెండవ రోజు కొనసాగుతోంది. ఢిల్లీలోని ముఖ్యమంత్రి అధికారిక నివాసం వన్ జనపథ్‌లో ఈరోజు ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి గృహ ప్రవేశం చేశారు. నిన్న సాయంకాలం ఢిల్లీకి చేరుకున్న చంద్రబాబునాయుడు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ రోజు ఆయన రాష్ట్రానికి తిరిగిరానున్నారు.

---------------------------

మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే రొట్టెల పండగ శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నెల్లూరు నగరంలో ఈ రోజు ప్రారంభమైంది. వరాల రొట్టెను అందుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి బారాషహీద్ దర్గా వద్దకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. స్వర్ణాల చెరువులో పుణ్యస్నానాలు చేసి అనంతరం కోర్కెల రొట్టెలు పంచుకుంటున్నారు. బారాషహీద్‌లకు గలేఫ్‌లు, పూల చద్దర్లు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా 5 వేల మంది సిబ్బంది రొట్టెల పండుగ విధుల్లో ఉన్నారు. భద్రతా విధుల్లో 2 వేల మంది పోలీసులను నియమించారు. కాగా.. ఈ రొట్టెల పండుగ ఐదు రోజుల పాటు జరగనుంది.

---------------------------

రేషన్ కార్డుల కోసం ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న వలస కార్మికుల వెరిఫికేషన్ ప్రక్రియను ఆలస్యం చేస్తున్న రాష్ట్రాలపై సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇది చాలా దురదృష్టకరమని వ్యాఖ్యానించింది. ఈ ప్రక్రియను నాలుగు వారాల్లోగా పూర్తి చేయాలని రాష్ట్రాలను సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. జాతీయ ఆహార భద్రత చట్టం కింద కోటాతో సంబంధం లేకుండా వలస కార్మికులకు రాష్ట్రాలు రేషన్ అందించాలంటూ

సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై గతంలో విచారణ జరిపిన ధర్మాసనం.. ఈ–శ్రమ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న దాదాపు 8 కోట్ల వలస కార్మికులకు రేషన్ కార్డులు జారీ చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది.

---------------------------

రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల ఉపకులపతుల రాజీనామాలను గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆమోదించారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం క్లస్టర్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయాల ఉపకులపతులు మినహా మిగిలిన వారు వివిధ కారణాలతో తమ పదవులకు రాజీనామాలు చేశారు. వీటికి గవర్నర్ నిన్న ఆమోదం తెలిపారు. ఈ దస్త్రం ముఖ్యమంత్రి కార్యాలయానికి చేరింది. ఒకటి, రెండు రోజుల్లో రాజీనామాలు చేసిన విశ్వవిద్యాలాల్లో ఇన్‌ఛార్జి ఉప కులపతులను నియమించనున్నారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 38 సెకన్లు....

---------------------------

కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలో ఉండటంతో ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి కార్యక్రమాలు వేగం పుంజుకున్నాయని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమహేంద్రవరం పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. ఈ మేరకు ఆమె ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. చిత్తూరు జిల్లా కుప్పం, శ్రీపొట్టి శ్రీరాములు జిల్లా దగదర్తి, శ్రీకాకుళం జిల్లా మూలపేటలో కొత్త విమానాశ్రయాలు ఏర్పాటు చేయగలుగుతున్నామని వెల్లడించా. అభివృద్ధి, కనెక్టివిటీ పెంపుతో పాటు ఆర్థిక పురోగతికి కూడా ప్రోత్సాహం అందిస్తున్నామని పేర్కొన్నారు.

---------------------------

రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ నూతన కార్యాలయాలను సంస్థ కార్యనిర్వాహక ఛైర్మన్ జస్టిస్ దుర్గా ప్రసాదరావు గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం మల్కాపురంలో ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరికీ అందుబాటులో న్యాయ సేవలు అందించడానికి రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కృషి చేయాలని సూచించారు. పేదరికం వల్ల న్యాయం కోసం న్యాయస్థానాలకు రావటానికి ఇబ్బంది ఎదుర్కొనే వారికి ఉచిత న్యాయ సహాయాన్ని అందించేలా కృషి చేయాలని జస్టిస్ దుర్గాప్రసాదరావు కోరారు.

======================